


## ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం

చర్లపల్లి డివిజన్, మధుసూదన్‌రెడ్డి కాలనీకి చెందిన లింగోజు రమేశ్–మంగమ్మ కుమార్తె తేజశ్రీ కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించగా, ఫీజు కోసం ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ..బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎంబీబీఎస్‌కు అయ్యే ఫీజు రూ.29వేల చెక్కును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సోమవారం విద్యార్థినికి అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత మహేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

– కాప్రా, అక్టోబర్ 14



దసరా సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేశ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – కుత్బుల్లాపూర్, అక్టోబర్14

దామగుండం అటవీ ప్రాంతం



# రాడార్ ఆపకుంటే.. రణరంగమే..

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తున్న దామగుండం పరిసర ప్రాంతాల ప్రజలు

- ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటున్న దామగుండం పరిరక్షణ జేఏసీ
- ఈసీ, మూసీ నదులకు ప్రమాదమంటున్న పర్యావరణ వేత్తలు
- 'నేవీ రాడార్' ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయడంపై స్థానికుల ఆగ్రహం
- కోర్టుకు వెళ్లి స్టే తెస్తామంటున్న పరిరక్షణ సమితి
- లక్షల చెట్ల నరికి వేతపై స్థానికుల ఆందోళన
- రేడియేషన్ ప్రభావం ప్రజల్లో భయం.. భయం..
- ఇప్పటికే ఊరూరా పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్న ప్రజలు
- ప్రాజెక్టు ఆపేదాకా పోరాడుతామంటున్న స్థానికులు

ఒకపక్క స్థానికుల నిరసనలు.. మరో పక్క పర్యావరణ వేత్తల హెచ్చరికలు.. అయినా కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణి మారలేదు.. ఎవ్వరి అభిప్రాయాలు పట్టించుకోకుండా దామగుండంలో నేవీ రాడార్ ప్రాజెక్టుకు మంగళవారం శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. లక్షల చెట్లు నరికివేస్తారని, అడవి నామరూపాలు లేకుండా పోనున్నదని స్థానికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రేడియేషన్ ప్రభావంపై భయపడుతున్నా సమాధానమిచ్చేవారే లేరు. ఈ ప్రాజెక్టు వల్ల ఈసీ, మూసీ నదులు ఉనికి కోల్పోతాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వానికి పట్టింపులేదు. పదేండ్ల క్రితమే రాడార్ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టింది.. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాడార్ కేంద్రం ఏర్పాటు కోసం 2900 ఎకరాల అటవీ భూములను నేవీకి అప్పగించింది.. ఈ భూముల్లో లక్షా 93 వేల చెట్లతోపాటు 400 ఎకరాల్లో గడ్డి భూములు ఉన్నాయి. వీటితోపాటు 500 ఏండ్లనాటి దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయం. లక్షల కోట్ల విలువైన ఔషధ మొక్కలు, 258 రకాల పక్షిజాతులు ఉన్నాయి. రక్షణశాఖ అవసరాలకు తాము వ్యతిరేకం కాదని, కానీ అడవిని నరికివేసి ప్రకృతి విధ్వంసం చేయడాన్ని తాము నిరసిస్తున్నామని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కోర్టుకు వెళ్లి అడ్డుకుని తీరుతామని 'సేవ్ దామగుండం' పేరిట ఉద్యమం చేస్తున్న దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ సభ్యులు తెలిపారు. తమ ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోతే అనేక రూపాల్లో నిరసనలు ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

– వికారాబాద్, అక్టోబర్ 14, నమస్తే తెలంగాణ

### రాడార్‌ను విరమించుకోకుంటే ఊరుకోం..



నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు వల్ల రేడియేషన్‌తో రాబోయే తరాలకు అన్యాయమే. వాతావరణం కలుషితమై వ్యాధులొస్తాయని మేధావులు, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. అమెరికా వంటి దేశంలో రాడార్‌ను తొలగించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకొప్పుకున్నది. రాడార్ నిర్ణయాన్ని విరమించుకోకుంటే ఊరుకునేది లేదు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం.

– చాకలి బుచ్చయ్య, పూడూరు గ్రామం

### కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది..



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల బాగోగులను ఆలోచించి రాడార్ ఏర్పాటుకు ఒప్పుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ప్రాంత ప్రజలకు కష్టాలు వచ్చాయి. పూడూరు, తిర్మలాపూర్, గూడుపల్లి, టేకులబిడ్ తండా, సోమన్‌గుర్తి తదితర గ్రామాల ప్రజలు ఈ అడవిలో మేకలు, పశువులను మేపుకొంటూ జీవనం కొనసాగిస్తాం. నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు రద్దు కోసం తెగించి కొట్లాడుతాం.

– సీహెచ్ పాండు, పూడూరు గ్రామం

### అడవిని నరికి మా పొట్ట కొట్టొద్దు..



చుట్టుపక్కల గ్రామాలకు ఉపాధిని కల్పించే అడవిని నరికి మా పొట్టకొట్టొద్దు. నేవీ రాడార్ స్టేషన్ మాకొద్దు.. బరాబర్ కొట్లాడుతాం. ఈ ప్రాంతాన్ని కలుషితం చేసి మా ప్రాణాలమీదకు తీసుకొస్తారా.. కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకిచ్చింది. ప్రజలను పట్టించుకోరా.. ఎంతో పురాతనమైన దామగుండ రామలింగేశ్వరస్వామి ఆలయం ఏమి కావాలె. లక్షల చెట్లను నరికివేసి మమ్మల్ని రోగాలపాలుజేస్తరా.

– రాంచంద్రయ్య, పూడూరు గ్రామం

### నేవీ రాడార్ వద్దే వద్దు..



రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలో నేవీ రాడార్ నిర్మాణం వద్దే వద్దు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై చింత లేదు. రోగాలబారిన పడితే ఎలా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు తీస్తాయా..? నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదు. ప్రభుత్వాలు పునరాలోచన చేయాలి.

– పీ సతీశ్ పంతులు, పూడూరు గ్రామం

## వెండర్స్ సమస్యను పరిష్కరించాలి



టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీని కలిసిన తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కందుకూరి శ్రీనివాస్, వెంకటేశ్, తదితరులు

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న వెండర్స్ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ ముషారఫ్ ఫరూఖీని కలిశారు. విద్యుత్ శాఖ చేపట్టే కాంట్రాక్టు పనులను ఆ శాఖలో వెండర్స్‌గా నమోదైన కాంట్రాక్టర్లు చేపడుతుంటారు. కొత్తగా తీసుకువచ్చిన నిబంధనలతో ఎన్నోఏళ్లుగా కాంట్రాక్టు పనులు చేస్తున్న వారికి అన్యాయం జరుగుతున్నది. ఈ అంశాన్ని పరిశీలించి తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్‌కు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని ప్రతినిధులు కోరారు. సీఎండీని కలిసినవారిలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కందుకూరి శ్రీనివాస్, మద్దునూరి వెంకటేశ్, మహేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, గడిగె సత్యనారాయణ ఉన్నారు.

## పది రూపాయల నాణేలు చెల్లుబాటు



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎల్బీనగర్ బ్రాంచ్ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ రాజేంద్రప్రసాద్

మన్సూరాబాద్, అక్టోబర్ 14: పది రూపాయల నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్బీనగర్ బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్బీనగర్ బ్రాంచ్‌కు విచ్చేసిన ఖాతాదారులకు పది రూపాయల నాణేలను ఆయన అందజేశారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు పది రూపాయల నాణాల చెల్లుబాటుపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది రూపాయల నాణేలు వినియోగంలో ఉన్నాయని.. ఎవరైనా పది రూపాయల నాణాలు తీసుకోనట్లయితే సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. పది రూపాయల నాణేల విషయంలో ఎవరూ సంకోచించ వద్దని నిర్భయంగా వాటిని తీసుకుని వాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నరేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, అక్టోబర్ 14 '(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ ఫుల్ టైమ్ జాబ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మోటార్ పూల్ డిస్‌పాచర్ పోస్టు కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, వారానికి 40 గంటల పాటు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ తప్పనిసరిగా ఉండాలని, ఇంగ్లిషులో బాగా మాట్లాడే నైపుణ్యంతో పాటు హిందీ, తెలుగు భాషలు తెలిసి ఉండాలి. లైట్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సు, ఇండిజన్ సిటిజన్ షిప్, విద్యార్హత పత్రాలతో నవంబర్ 6వ తేదీలోగా యూఎస్ కాన్సులేట్ వెబ్‌సైట్ (https://in.usembassy.gov/embassy-consulates/jobs/hydera bad/)లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## గ్రూప్-1 మెయిన్స్‌కు ఏర్పాట్లు

మేడ్చల్, అక్టోబర్14(నమస్తే తెలంగాణ): ఈ నెల 21 నుంచి 27 వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 12: 30 గంటల నుంచి 1: 30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారని పేర్కొన్నారు. గ్రూప్–1 పరీక్ష ఏర్పాట్లపై ప్రత్యేక అధికారులను నియమించామని, ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చూడాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు.

## ఐఏపీటీసీబీ అధ్యక్షుడిగా డా.రమేశ్ బాబు

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ట్విన్ సిటీస్ బ్రాంచ్(ఐఏపీటీసీబీ)అధ్యక్షుడిగా నిలోఫర్ దవాఖాన రిటైర్డ్ ఆర్ఎంవో డాక్టర్ రమేశ్ బాబు దాంపురి ఎన్నికయ్యారు. పిల్లల వైద్యం, ఆధునిక చికిత్స పద్ధతులు, వ్యాధులు, వాటి నివారణ తదితర అంశాలపై అధ్యయనాలు చేయడం, అవగాహన సదస్సులు తదితర కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ జంట నగరాల శాఖకు సంబంధించి జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 1800మంది వైద్యులు, వైద్య విద్యార్థులు సభ్యులుగా ఉండగా అందులో 1240మంది వైద్యనిపుణులు ఓటర్లుగా ఉన్నట్లు ఐఏపీ ప్రతినిధులు తెలిపారు. అయితే 2025 జనవరి నుంచి డా.రమేశ్ బాబు ఐఏపీ జంటనగరాల శాఖకు ప్రెసిడెంట్ ఎలక్ట్‌గాను , 2026 జనవరి నుంచి డిసెంబర్ వరకు సంవత్సర కాలం పాటు పూర్తిస్థాయి ప్రెసిడెంట్‌గా వ్యవహరించనున్నట్లు ఎన్నికల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు వైద్యులు డా.రమేశ్‌దాంపురికి శుభాకాంక్షలు తెలిపారు.

## దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, అక్టోబర్ 14 : దివ్యాంగులకు అండగా ఉంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే దివ్యాంగులకు న్యాయం జరిగిందని.. దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించామని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని.. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు అర్కల కామేశ్ రెడ్డి, రవి నాయక్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నర్సిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్

వలిగొండ, అక్టోబర్ 14 : మండలంలోని ముద్దాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సూది నర్సిరెడ్డి దసరా రోజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించి ఓదార్చారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాశం సత్తిరెడ్డి, భీమా భుక్యానాయక్, జనార్దన్‌రెడ్డి, రమేశ్, అనంతరెడ్డి, నరేశ్‌రెడ్డి, కిష్టయ్య, సహదేవ్, సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

సిటీబ్యూరో, అక్టోబరు 14 (నమస్తే తెలంగాణ ) : ప్రజావాణి విజ్ఞప్తుల పరిష్కారానికి చొరవ చూపాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను అధికారులు స్వీకరించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా ఆరు విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. 26 విన్నపాలు రాగా అందులో టౌన్‌ప్లానింగ్ 12, ట్యాక్స్ సెక్షన్ ఆరు, సీఈ మెయింటనెన్స్ 2, ఎఫ్ఏ సెక్షన్ రెండు, ఎస్టేట్, అడ్వర్టైజ్‌మెంట్, హెల్త్, ఎల్‌డబ్ల్యూఎస్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయి. ఆరు జోన్లలో 52 అర్జీలు స్వీకరించగా కూకట్‌పల్లి జోన్‌లో 25, సికింద్రాబాద్‌లో 14, ఎల్బీనగర్‌లో 5, చార్మినార్ జోన్‌లో నాలుగు, శేరిలింగంపల్లిలో మూడు, ఖైరతాబాద్‌లో ఒక అర్జీ వచ్చాయని తెలిపారు.

## అమ్మవారి చీర రూ.3.79 లక్షలు



అమ్మవారి చీరను కైవసం చేసుకున్న గంజి లాలీశ్వర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 14: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను నిమ్మజ్జనానికి తరలించారు. అంతకు ముందు దేవాలయాల వద్ద అమ్మవారి చీరలకు వేలం పాట నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని భూ లక్ష్మమ్మ దేవాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి చీరను గంజి లాలీశ్వర్ రూ.3.79 లక్షలకు వేలం పాటలో కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి చీరలను0 అందజేశారు.అమ్మవారి నిమజ్జన ర్యాలీలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు.

## నగరం బాట పట్టిన జనం



ఆత్మకూరు(ఎం) ప్రధాన రోడ్డుపై బస్సులు లేక ప్రైవేట్ వాహనాలు ఎక్కుతున్న ప్రయాణికులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 14 : దసరాకు పల్లెలకు వచ్చిన జనం పండుగను ముగించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో నగరానికి వెళ్లే వాహనాలతో రహదారులు రద్దీగా మారాయి. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి – వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం 60వేల నుంచి 70వేల వాహనాలు వెళ్లినట్లు ట్రాఫిక్ సీఐ కృష్ణ తెలిపారు. రహదారిపై ప్రమాదాలు జరుగకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు పలు సూచనలు చేశారు. కారులో సీటు బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. వరంగల్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రత్యేకంగా రోడ్డుకు ఎడమ వైపు ప్రయాణం చేయాలని, వాహనాల వేగం తగ్గించాలని అన్నారు. ఆదివారం రాయగిరి మీదుగా సుమారు 40వేల వాహనాలు హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిపారు.

### సరిపడా బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

ఆత్మకూరు(ఎం) : దసరా పండుగకు పట్టణం నుంచి పల్లెలకు వచ్చిన ప్రజలు హైదరాబాద్, భువనగిరి పట్టణాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సోమవారం వివిధ గ్రామాల ప్రజలు ఆత్మకూరు(ఎం)లోని మోత్కూర్ – భువనగిరి ప్రధాన రోడ్డుపై బస్టాప్ వద్ద బస్సుల కోసం అధిక సంఖ్యలో వేచిఉన్నారు. అయితే.. ఆర్టీసీ స్పెషల్ బస్సులతోపాటు ఇతర బస్సులు స్టేజీ వద్ద ఆపకుండా వెళ్లిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత్యంతరం లేక ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో భువనగిరి, హైదరాబాద్‌కు పోవాల్సి వచ్చింది.

## ప్రజా ఉద్యమాలను అణిచివేస్తున్న బీజేపీ సర్కారు : సీపీఎం

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 14 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. చౌటుప్పల్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడిన దివ్యాంగ ప్రొఫెసర్ సాయిబాబాను జైల్లో నిర్బంధించి వైద్య సౌకర్యాలు కల్పించకుండా చేయడంతోనే ఆయన మరణించారన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బండారు నర్సింహ, రాజేశ్వరి, ధర్మయ్య, దాసు, శ్రీను పాల్గొన్నారు.

## సీఎంఆర్‌లో బహుమతుల వెల్లువ

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ) : సీఎంఆర్‌లో దసరా, దీపావళి బిగ్గెస్ట్ ఫెస్టివ్ ధమాకాలో బహుమతులు వెల్లువ కొనసాగుతున్నది. సీఎంఆర్ షాపింగ్ మాల్ దసరా, దీపావళి పండుగను పురస్కరించుకొని సెప్టెంబర్ 19 నుంచి ది బిగ్గెస్ట్ ఫెస్టివ్ ధమాకా తెలంగాణలో ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, మిర్యాలగూడ, ఉప్పల్, హన్మకొండ, షాద్‌నగర్, హయత్‌నగర్, బీహెచ్ఈఎల్, కరీంనగర్‌లోని సీఎంఆర్ మాల్స్‌లలో ప్రతి రూ.500ల కొనుగోలుపై ఒక లక్కీ డ్రా కూపన్‌ను తమ కస్టమర్లకు అందజేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆఫర్‌లో భాగంగా గంట గంటకూ బహుమతులు అందజేస్తున్నది. ఇప్పటి వరకు 2000 మందికి పైగా కస్టమర్లు ది బిగ్గెస్ట్ ఫెస్టివ్ ధమాకాలో విజేతలుగా నిలిచి బహుమతులు గెలుపొందారని, డైలీ, వీక్లీ, దీపావళి బంపర్ డ్రాలో కస్టమర్లు మరిన్నీ బహుమతులు గెలుపొందవచ్చుని సీఎంఆర్ షాపింగ్ మాల్ జనరల్ మేనేజర్ నూలు లింగమూర్తి తెలిపారు. సోమవారం 10 మంది విజేతలకు ఆల్టో కె–10 కార్లను అందజేసినట్లు పేర్కొన్నారు.